

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 179 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 30, మే 2026 | పేజీలు 8 | వెల రూ. 5


పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, ఛైర్మన్

# రాజకీయ విలువలను దిగజార్చకండి!






రాజకీయాల్లో వ్యక్తిగత స్వార్థాలకే విలువ ఎక్కువ

ప్రజా సమస్యలపై పట్టింపు లేకుండా పోతుంది

నిండు చట్ట సభల్లో అంబర్లు తినే స్థాయికి దిగజారిపోయాయి

అసెంబ్లీ సభలలో దిగజారుడు సంభాషణ నడుస్తున్నాయి

దేశంలోని విపత్తు కాలాలపై పోరాటాలు ఎక్కడ

పవిత్రమైన పార్లమెంట్ అసెంబ్లీ భవనాలను అపవిత్రం చేస్తున్నారు

రాజకీయాల్లో పూర్వ వైభవం పూర్తిగా కొరవడింది

పార్లమెంట్ అసెంబ్లీలలో ఎంత మొత్తుకున్నా ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు

ప్రజలకు విలువనిచ్చే నాయకులు కరువు అవుతున్నారు

ప్రజా ప్రయోజనార్థం ప్రతి నాయకుడు ఎంత మేర పని చేస్తున్నాడు : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

రాజకీయ పలుకుబడిని దిగజార్చే పనులు చేయకూడదని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. రాజకీయాల్లో జవాబుదారీతనం పూర్తిగా కొరవడుతుందని నిలదీశారు. ప్రభుత్వాలు అంటే ఎంతో బాధ్యతతో వ్యవహరిస్తూ పేద ప్రజలకు సహాయార్థంగా పాలన చేయాల్సింది పోయి దేశవ్యాప్తంగా పేద ప్రజలు అల్లాడుతుంటే నిత్యవసరాల ధరలను ఆకాశానికి చేరే విధంగా పెంచుతూ సామాన్య వర్గాలపై ఆర్థిక భారాన్ని పెంచుతున్నారని విమర్శించారు. నాయకుల వ్యక్తిగత వ్యాపారాలపై వ్యాపారస్తులపై ఉన్న శ్రద్ధ ప్రజాసేవపై లేకపోవడం రాజకీయ విలువలను దిగజారుస్తున్నట్లుగా ఉందని అభిప్రాయపడ్డారు. ఎక్కడ చూసినా రాజకీయ పలుకుబడి కోసం మాత్రమే రాజకీయ నాయకులు గాబర పడుతున్నారు తప్ప ప్రజలను మోసగించడంలో ఆరితేరిపోతూ ప్రభుత్వాల పేరు చెప్పి ప్రజలను పేరుపేరునా ప్రలోభాలకు గురి చేస్తూ మోసం చేస్తున్నారని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా పార్లమెంటులో గాని అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలో గాని ప్రజలను అభివృద్ధిపరిచే సమావేశాల చర్చలు పూర్తిగా తగ్గిపోయాయని ఆర్థిక భారాన్ని ప్రజలపై రుద్ది పార్లమెంట్ చట్టాలకు అసెంబ్లీ చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వాల ఆర్థిక బడ్జెట్ బిల్లులను ప్రవేశపెడుతున్నారని క్షేత్రస్థాయిలో విమర్శించారు. ప్రజల ఆలోచనలకు ప్రభుత్వాల పాలనకు సరితూగని విధంగా రాజకీయ నాయకుల వ్యక్తిగత అభివృద్ధిని మాత్రమే

- మిగతా 2లో..

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌పై వడ్డీ చెల్లింపుల వివాదం

మహారాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిపాజిట్లపై ప్రశ్నలు

స్పాన్సర్‌షిప్ పేరిట నిధుల బదిలీ ఆరోపణలు

ఆర్‌బీఐ నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అనే చర్చ

మధ్యవర్తి సంస్థల పాత్రపై అనుమానాలు

విషయంపై దర్యాప్తు, పరిశీలనకు డిమాండ్

2

HDFC BANK

## పెట్రోల్ బంకుల్లో కొత్త మార్పులు

ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

ఈ-20, ఈ-22, ఈ-25, ఈ-30 ఇంధన బ్రాండ్లు అందుబాటులోకి

ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని ని తగ్గించడమే లక్ష్యం

పెట్రోల్ బంకుల్లో ప్రత్యేక లేబుళ్లు, డిస్పెన్సర్లపై స్పష్టమైన సమాచారం

కార్బన్ ఉద్గారాల తగ్గింపుతో పర్యావరణానికి మేలు

ప్రభుత్వ, ప్రైవేట్ చమురు సంస్థలకు కేంద్రం ఆదేశాలు




2

## మోత్కూరు గ్రామంలో తాగు నీటి సమస్య..

## కాలి బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

2

## తెలంగాణలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం


వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులు

నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, కొమురం భీమ్ జిల్లాల్లో వర్షాలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు, మక్కలు




3





## బాబాసాహెబ్ ఆశయాల సాధనే జీవిత లక్ష్యం: డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద భావోద్వేగ వ్యాఖ్యలు

విగ్రహం బహుజన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని వెల్లడి

అంబేద్కర్ మార్గం సమాజ మార్పుకు వెలుగుబాటగా మారిందని అభిప్రాయం

రాజ్యాంగ హక్కుల సాధన కోసం నిరంతర పోరాటమే లక్ష్యమని స్పష్టం

చివరి శ్వాస వరకు సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానని సంకల్పం

2

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా

సంపుటి - 07 | సంచిక 179 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 30, మే 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌పై వడ్డీ చెల్లింపుల వివాదం

**మహారాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిపాజిట్లపై ప్రశ్నలు**
**స్పాన్సర్‌షిప్ పేరిట నిధుల బదిలీ ఆరోపణలు**
**ఆర్‌బీఐ నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అనే చర్చ**
**మధ్యవర్తి సంస్థల పాత్రపై అనుమానాలు**
**విషయంపై దర్యాప్తు, పరిశీలనకు డిమాండ్**

**ఢిల్లీ, మే 29 (జై భీమ్ న్యూస్):**

ప్రైవేట్ బ్యాంకుల డిపాజిట్ విధానాలు, పెద్ద సంస్థలకు అందించే ప్రయోజనాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు సంబంధించిన ఒక వివాదాస్పద అంశం వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీ) డిపాజిట్లకు సంబంధించి అదనపు ప్రయోజనాలు కల్పించారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. సాధారణ సేవింగ్స్ ఖాతాదారులకు సుమారు 3.5 శాతం వడ్డీ లభిస్తుండగా, ఎంఆర్‌డీసీ డిపాజిట్లకు 6.1 శాతం మేర ప్రయోజనం అందినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. అయితే ఈ అదనపు మొత్తాన్ని నేరుగా వడ్డీ రూపంలో కాకుండా, రోడ్ సేఫ్టీ స్పాన్సర్‌షిప్ కార్యక్రమాల పేరిట అందించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఆరోపణల ప్రకారం, బ్యాంకు నలుగురు ప్రైవేట్ వెండర్ల ద్వారా సుమారు ?45 కోట్లను రోడ్ సేఫ్టీ కార్యక్రమాల కోసం విడుదల చేసినట్లు, ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాల్లో మార్కెటింగ్ వ్యయంగా నమోదు చేసినట్లు సమాచారం. విమర్శకులు మాత్రం దీనిని పరోక్ష వడ్డీ చెల్లింపుగా అభివర్ణిస్తున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనల ప్రకారం ఒకే తరహా డిపాజిట్లకు సమాన వడ్డీ విధానం అమలు చేయాలని సూచనలు ఉన్న నేపథ్యంలో, ఈ వ్యవహారంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పెద్ద సంస్థలకు పరోక్ష మార్గాల్లో అదనపు ప్రయోజనాలు కల్పించడం నిబంధనలకు విరుద్ధమా అనే అంశంపై చర్చ కొనసాగుతోంది. ఇక మధ్యవర్తులుగా వ్యవహరించిన వెండర్ల ఎంపిక, నిధుల వినియోగం, వాటిపై చెల్లించిన జీఎస్టీ, ఇతర ఖర్చుల అంశాలు కూడా పరిశీలనకు వస్తున్నాయి. ఈ ప్రక్రియలో పారదర్శకత పాటించారా లేదా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత సంస్థలు, బ్యాంకు వర్గాల అధికారిక స్పందన, నియంత్రణ సంస్థల తుది నిర్ధారణ వెలువడాల్సి ఉంది. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఈ ఆరోపణలను ఆరోపణలుగానే పరిగణించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

# పెట్రోల్ బంకుల్లో కొత్త మార్పులు

**ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్**
**ఈ-20, ఈ-22, ఈ-25, ఈ-30 ఇంధన బ్రాండ్లు అందుబాటులోకి**
**ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే లక్ష్యం**
**పెట్రోల్ బంకుల్లో ప్రత్యేక లేబుళ్లు, డిస్పెన్సర్లపై స్పష్టమైన సమాచారం**
**కార్బన్ ఉద్గారాల తగ్గింపుతో పర్యావరణానికి మేలు**
**ప్రభుత్వ, ప్రైవేట్ చమురు సంస్థలకు కేంద్రం ఆదేశాలు**

**ఢిల్లీ, మే 29 (జై భీమ్ న్యూస్):**

దేశంలో ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల్లో ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌ను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ-20, ఈ-22, ఈ-25, ఈ-30 వంటి వివిధ రకాల ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ బ్రాండ్లను ప్రవేశపెట్టనుంది. వాహనాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త ఇంధనాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన Indian Oil Corporation, Bharat Petroleum, Hindustan Petroleumతో పాటు ప్రైవేట్ రంగ సంస్థలైన Jio-bp, Nayara Energy, Shell అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

**పెట్రోల్ బంకుల వద్ద ప్రత్యేక లేబుళ్లు**

ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌ను వినియోగదారులు సులభంగా గుర్తించేందుకు పెట్రోల్ బంకుల వద్ద ప్రత్యేక లేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే డిస్పెన్సర్లపై ఇంధనంలో కలిపిన ఇథనాల్ శాతాన్ని స్పష్టంగా ప్రదర్శించనున్నారు. దీంతో వాహన యజమానులు తమ వాహనానికి అనుకూలమైన ఇంధనాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం దేశంలోని అనేక పెట్రోల్ బంకుల్లో ఈ-20 ఇంధనం ఇప్పటికే అందుబాటులో ఉంది. దేశంలో ఇథనాల్ ఉత్పత్తి పెరుగుతున్న నేపథ్యంలో దీని వినియోగాన్ని మరింత విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**మైలేజ్‌పై ప్రభావం?**

అధిక ఇథనాల్ శాతం కలిగిన ఇంధనం వాడితే మైలేజ్ తగ్గుతుందనే, ఇంజిన్ పనితీరుపై ప్రభావం పడుతుందనే అభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఈ-20 వంటి ఇంధనాలు వాహన పికప్‌ను మెరుగుపరుస్తాయని, సాధారణ వినియోగంలో మైలేజ్‌పై పెద్దగా ప్రభావం ఉండదని ప్రభుత్వం పేర్కొంటోంది.

**తగ్గనున్న ముడి చమురు దిగుమతులు**

ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు వినియోగదారైన భారత్ తన అవసరాల్లో అధిక భాగాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో ఇథనాల్‌ను ప్రత్యామ్నాయ ఇంధనంగా ప్రోత్సహిస్తోంది. ఇథనాల్ వినియోగం పెరగడం వల్ల ముడి చమురు దిగుమతులు తగ్గి విదేశీ మారకద్రవ్య వ్యయం తగ్గడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడనుంది. భవిష్యత్తులో దీతీఖఓఱశ్రీ తరహాలో భారత వినియోగదారులు కూడా తమ అవసరాలకు అనుగుణంగా వివిధ ఇథనాల్ మిశ్రమ ఇంధనాలను ఎంపిక చేసుకునే అవకాశం ఏర్పడనుంది.

# మొత్కూరు గ్రామంలో తాగు నీటి సమస్య..

**కాలి బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు**

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని మొత్కూరు గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. గత కొన్ని రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఖాళీ బిందెలతో రోడ్డుపై మహిళల ధర్నా నిర్వహించారు. నిరసన కారణంగా ప్రధాన రోడ్డుపై అర కిలో మీటర్ల మేర స్తంభించిన వాహనాలు, సమస్య త్వరగా తీరకపోతే ఎంపిడిఓ ఆఫీస్‌ను ముట్టడిస్తామని మొత్కూరు ప్రజల హెచ్చరిక. గ్రామ సర్పంచ్ కొత్తపేట ఆనంద్ కు ఈ విషయం తెలిసిన వెంటనే అక్కడికి చేసుకొని సమస్యని తీర్చే బాధ్యత నాది అని ఆయన అన్నారు.

# రాజకీయ విలువలను దిగజార్చకండి

మొదటి పేజీ తరువాయి

బలపరుచుకుంటూ ప్రజాసేవను విస్మరిస్తున్నారని తెలిపారు. 2014లో కేంద్రంలో అధికారంకొచ్చిన బిజెపి ప్రభుత్వం సుదీర్ఘమైన కాలం పాటు దేశాన్ని పాలిస్తూ ఉంటుండగా దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంత మేరకు నెరవేర్చారు అనేది ఏ ఒక్కరు అడగలేకపోతున్నారని పైగా ప్రభుత్వాలను గాని నాయకులను గాని ప్రశ్నిస్తున్న సందర్భాల్లో తీవ్రమైన అణిచివేతను కొనసాగిస్తున్నారని దాని ప్రభావం ప్రజాస్వామ్య విలువలపై పెద్ద ఎత్తున పడుతుందన్నారు. నోట్ల రద్దుతో దేశం లోని ఆర్థికమాన్యం చిన్న భిన్నమైపోగా దేశ ప్రజలు ఎటు తేల్చుకోలేని స్థితిలో ఆర్థిక ఇబ్బందులతో లెక్కలేనంతమంది ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. రాత్రికి రాత్రి నోట్ల మార్పిడి చట్టం రూపంలో వెలుగొందడంతో దేశ ప్రజలు దిక్కుతోచని స్థితిలోనికి వెళ్లిపోయారన్నారు. మేక్ ఇన్ ఇండియా పై ఇప్పటివరకు కనీసం సూచనాభిప్రాయమైన అభివృద్ధి కూడా జరగలేదనేది వాస్తవమన్నారు. బ్లాక్ మనీ తిరిగి తెస్తూ 15 లక్షల రూపాయల చొప్పున దేశ ప్రజల అకౌంట్లో జమ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరకపోగా దేశంలో బడా వ్యాపారస్తులు అందరూ ప్రపంచంలోని ఇతర దేశాలలో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసుకునే స్థాయికి ఎదిగారని అదంతా కేవలం కేంద్ర ప్రభుత్వం సహకారం కేంద్ర ప్రభుత్వం చొరవతో మాత్రమే జరుగుతుందని తెలిపారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్య ఇంధన ధరల నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత లేని వైఖరితో ప్రజలను అరిగోస పెడుతుందని గుర్తు చేశారు. విమర్శకులకు తావిచ్చే విధంగా దేశవ్యాప్తంగా ఇంధన వ్యాప్తి పై పెరుగుతున్న ధరలను చూసి పేద ప్రజలు ఎలా జీవించాలో అర్థం కావడం లేదన్నారు. పైగా అన్ని రాష్ట్రాలలో ఇంధనం ధరల పెరుగుదల వల్ల సామాన్యులైన పేద ప్రజలు, కడుపేద స్థితిని అనుభవిస్తున్న రైతులు మాత్రమే లెక్కలేనన్ని ఇబ్బందులు పడుతున్నారని వాటి భారాన్ని ప్రతి రాష్ట్రంలోని ప్రభుత్వం ఛాలెంజ్గా తీసుకొని ఇంధనాల ధరల పెంపు నియంత్రణకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు.

**ప్రజల హక్కుల పైనే మా పోరాటం..**

భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కరుడుగట్టిన పేదరికాన్ని అనుభవించి ఎంతో ఎత్తుకు ఎదిగిన విధానం రాజకీయ నాయకులు జ్ఞాపకం చేసుకోవాలని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పైన పోరాటం చేస్తే రాజకీయ విలువలను దిగజార్చుకుంటూ కేసులు కట్టే పద్ధతిని పూర్తిగా నిర్మూలించబడాలన్నారు. సుప్రీం కోర్ట్ నియమాలు భారత రాజ్యాంగ హక్కులు దేశంలోని ప్రజలందరికీ ప్రశ్నించే హక్కు నిలదీసే హక్కు తప్పులపై పోరాటాలు చేసే హక్కులు చట్టాల రూపంలో కల్పించబడగా రాజకీయంలో ఉన్న వ్యక్తులు అధికారాల్లో ఉన్న వ్యక్తులు పోరాటదారులపై పోటీపడి కక్ష సాధింపు చర్యలతో రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. ప్రజలకు సేవ చేయాల్సిన చట్టసభలను వ్యక్తిగతమైన అవసరాల కోసం వాడుకోవడం అలాంటి నాయకులు రాజకీయ అసమర్థతకు సరితూగే వాళ్ళుగా గుర్తించబడుతుందన్నారు. ప్రజల హక్కులపై పోరాటం చేయాలంటే సాహసవంతమైన గుర్తింపు తెచ్చుకోవాలని అలాంటివన్నీ ధైర్య సాహసాలు కలిగిన వ్యక్తులకు మాత్రమే సాధ్యమైతాయని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రజలు క్లిష్టమైన పరిస్థితిలో జీవన విధానాలను కొనసాగిస్తున్నారని వాళ్ళందరూ కేవలం ప్రభుత్వాలు కల్పించే సౌకర్యాలు ప్రభుత్వాలు కల్పించే ఆర్థిక వనరులపై ఏమాత్రం ఆశపడకుండా స్వతహాగా వాళ్ల జీవితాలను జీవించుకొనివ్వకుండా ప్రజలపై క్రూరమైన స్వభావాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాలు అధికారంలోనికి రావడానికి ప్రజల సహకారం ప్రజల ఓట్లు ఎంత అవసరమో అధికారంలోనికి వచ్చిన ప్రభుత్వాలు ప్రజల హక్కులను కాపాడడం అంతే అవసరమని ప్రజల హక్కులను పెడచెవిన పెడుతున్న ప్రభుత్వాలు దీర్ఘకాలిక మూల్యాలను చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజావిశ్వాసంతో సంబంధం లేకుండా చట్టసభలను నడిపించడం రాజకీయ అవివేకంగా భావించాల్సి ఉంటుందన్నారు. పార్లమెంట్ గాని అసెంబ్లీ లాంటి భవనాలు నిరూపితమైనదే ప్రజల హక్కులను రక్షించడానికి ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడానికి అనే విషయాన్ని నేటి రాజకీయ పాలకులు పూర్తిగా మర్చిపోతున్నారని గుర్తు చేశారు.


**దరిదాపుల్లో లేని ధరల పెంపు నియంత్రణ..**

ప్రజలను నిరంతరం మోసగిస్తూ పేద ప్రజల జీవితాలపై పిడుగు లాంటి ఆర్థిక భారాలను వేస్తూ పేద ప్రజలు నిత్యావసరాల కోసం వాడుకుంటున్న ప్రతి వస్తువుపై లెక్కలేనంత రుసుమును పెంచుతూ విదేశాలపై నెడుతుండడం పూర్తి తప్పుగా భావించాలన్నారు. దేశంలో లభ్యమయ్యే అత్యవసరాల వస్తువులన్నీ ఇతర దేశాలపై దిగుమతులు చేసుకుంటున్నామంటూ యుద్ధం ముగిసి చాలా రోజులు గడుస్తున్నప్పటికీ యుద్ధ ప్రభావం ఏ దేశం మీద లేనిది కేవలం భారతదేశం మీద ప్రభావం చూపిస్తున్నట్లుగా దేశ ప్రజల ఆర్థిక స్థితిగతులపై నిత్యావసరాల ధరల పెంపు అనే భారాన్ని వేసి ప్రజల జీవితాలతో చెలగాటాలాడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వాలకు ప్రజలు చెల్లిస్తున్న పన్నులను ప్రజల ఆర్థిక అవసరాల కోసం ఉపయోగిస్తున్న ప్రభుత్వాలు వాళ్ల జవాబుదారీతనాన్ని ప్రదర్శించడం కోసం పార్లమెంటు సభల్లో గానీ అసెంబ్లీ సభల్లో గాని ప్రజలకు ఇస్తున్న హామీల ప్రకారం ప్రజల సొమ్మును ప్రజలకు ఖర్చు చేస్తూ దేశవ్యాప్తంగా పెంచబడుతున్న నిత్యవసరాల ధరలపై తక్షణమే వెనక్కి తగ్గాలని ఉన్నపాటుగా పేద ప్రజలు ఉపయోగించుకుంటున్న నిత్యవసరాలు ధరలు అన్నిటిని తగ్గించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామికవేత్తల నుండి వ్యాపారస్తుల నుండి వాళ్ల వాళ్ల స్థాయికి తగ్గ పన్నులను, ఐటీలసొమ్మును వసూలు చేస్తూ పేద ప్రజలకు పంచాలని సూచించారు. వ్యాపారస్తులు, వ్యాపారవేత్తలు, లక్షల కోట్ల ఆస్తులకు ఎదుగుతున్నారని కేవలం అదంతా ప్రభుత్వాల చలవేనంటూ పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులలో పేద ప్రజలపై పన్నుల భారం గాని, ఆర్థిక భారం గాని పడకుండా సంపన్నుల వ్యాపారాలపై పెంచుతున్న పన్నులను వాటి ద్వారా వస్తున్న ఆర్థిక లాభాలను పేద ప్రజల సహాయార్థం ఉపయోగించాలని సూచించారు. ప్రతి రాష్ట్రంలో అత్యంత ధనవంతుల జాబితాలను వెలుగులోనికి తెచ్చి వాళ్ళు సంపాదిస్తున్న అక్రమ సొమ్మంతటిని చట్టపరంగా న్యాయపరంగా ప్రభుత్వాల పరం చేసుకుంటూ పేద ప్రజలకు సహాయపడాలని పేర్కొన్నారు. పేద ప్రజలే టార్గెట్ గా పనిచేసే ప్రభుత్వాలు గానీ రాజకీయ నాయకులు గానీ నిజాయితీని తప్పుకొని పనిచేస్తున్నట్లుగా ప్రజలు భావిస్తారని గుర్తు చేశారు.

**రాజకీయాల్లో కొరవడుతున్న జవాబుదారితనం..**

దేశం మొత్తంలో వేల సంఖ్యలో ఉన్న రాజకీయ నాయకులు ఎంపీలుగా కొనసాగుతున్న, శాసన సభ్యులుగా కొనసాగుతున్న, మంత్రులుగా కొనసాగుతున్న, కేంద్ర మంత్రులుగా కొనసాగుతున్న, ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న, ప్రధానమంత్రిగా కొనసాగుతున్నప్పటికీ ఐదు సంవత్సరాల పదవి కాలంలో రాజకీయ ఎన్నికల్లో నిలబడడానికి ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా పాటించకపోతే వాళ్లు కొనసాగుతున్న పదవీకాలంలో దిగజారుడుతనాన్ని ప్రదర్శించినట్లేనని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంటు స్థానంలో గాని అసెంబ్లీ స్థానంలో గాని రాజకీయ పదవిలో కొనసాగుతున్న రాజకీయ నాయకులపై ప్రజలకు గాని ప్రజా సంఘాలకు గాని ఉద్యమకారులకు గాని మేధావులకు గాని సాధారణ ప్రజలకు గాని జర్నలిస్టులకు గాని పూర్తిస్థాయిలో ప్రశ్నించే, విమర్శించే, నిలదీసే హక్కులు ఉంటాయని అవన్నీ రాజ్యాంగబద్ధంగా చట్టబద్ధంగా న్యాయస్థానాల రూపంలో దేశ ప్రజలకు కల్పించబడిన హక్కులని ప్రస్తుతం దేశవ్యాప్తంగా వాటన్నిటిని కాలరాస్తున్న ప్రతి రాజకీయ నాయకుడు రాజకీయ జవాబుదారీతనానికి దూరంగా ఉంటున్నారని భావించాల్సి ఉంటుందన్నారు. కొంతమంది నాయకులు ప్రజాసేవను సొంత కుటుంబ సేవగా భావిస్తారని అలాంటివాళ్లు ప్రజలకు సమర్థవంతమైన జవాబుదారీతనాన్ని అందిస్తారన్నది మాత్రం వాస్తవం అన్నారు. దేశంలో కురవడుతున్న రాజకీయ విలువలను కాపాడుకొండంటూ పిలుపునిచ్చారు.

# బాబాసాహెబ్ ఆశయాల సాధనే జీవిత లక్ష్యం: డాక్టర్ బరిగెల శివ



**హైదరాబాద్ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద భావోద్వేగ వ్యాఖ్యలు**
**విగ్రహం బహుజన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని వెల్లడి**
**అంబేద్కర్ మార్గం సమాజ మార్పుకు వెలుగుబాటగా మారిందని అభిప్రాయం**
**రాజ్యాంగ హక్కుల సాధన కోసం నిరంతర పోరాటమే లక్ష్యమని స్పష్టం**
**చివరి శ్వాస వరకు సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానని సంకల్పం**

**హైద్రాబాద్, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం తన కలం, కెమెరా, గళంతో నిరంతరం ప్రజల పక్షాన నిలబడతానని జై భీమ్ టీవీ ఫౌండర్ మరియు చైర్మన్ డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని 125 అడుగుల బాబాసాహెబ్ అంబేద్కర్ మహా విగ్రహం వద్ద సందర్శించిన సందర్భంగా ఆయన తన భావాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాబాసాహెబ్ అంబేద్కర్ మహా విగ్రహం పాదాల వద్ద నిలబడిన ప్రతిసారి తన హృదయం గర్వంతో నిండిపోతుందని తెలిపారు. ఈ విగ్రహం కేవలం ఇనుము, రాతితో నిర్మించిన శిల్పం మాత్రమే కాదని, కోట్లాది అణగారిన, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి, సమానత్వానికి, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన మార్గం దేశంలోని అణగారిన వర్గాలకు వెలుగుబాటగా మారిందని, విద్య, హక్కులు, స్వాభిమానం, సామాజిక చైతన్యం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలన్న ఆయన సంకల్పం నేటికీ కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజలకు చేరవేయడం, సామాజిక న్యాయం కోసం పోరాటం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. సమాజంలో చైతన్యం, విద్య, హక్కుల పరిరక్షణ కోసం తన చివరి శ్వాస వరకు పోరాడుతానని స్పష్టం చేశారు. “నా జీవితం నాది కాదు... సమాజానిది. నా కల నాది కాదు... బహుజనుల భవిష్యత్తుది” అనే భావనతోనే తన ప్రజా జీవితాన్ని కొనసాగిస్తున్నానని చెప్పారు. మీడియా ఒక సామాజిక బాధ్యతగా భావిస్తున్నానని, బాబాసాహెబ్ ఆశయాల సాధన కోసం తన కలం, కెమెరా, గళం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పనిచేస్తాయని తెలిపారు. బహుజన సమాజ అభ్యున్నతి, సామాజిక సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. చివరగా డాక్టర్ బరిగెల శివ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు నివాళులర్పిస్తూ “జై భీమ్, జై రాజ్యాంగం, జై బహుజన భారత్” అంటూ తన



సందేశాన్ని ముగించారు.

# బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం సాక్షిగా దేశాల భూపాల్‌కు ఘన సన్మానం

**హైద్రాబాద్, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్‌ను హైదరాబాద్‌లోని బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 125 అడుగుల మహా విగ్రహం వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేశాల భూపాల్‌తో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు పారదర్శక పరిపాలన అందించడంలో, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో దేశాల భూపాల్ అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణతో పాటు ప్రజల హక్కుల సాధనలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. అలాగే సమాచార హక్కు చట్టం అమలులో ప్రజలకు మరింత చేరువై సేవలందించాలని, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు కృషి కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ టీవీ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ, ఎస్.ఎస్. రాజు, డాక్టర్ సుగుణకర్ రాజ్ రవి, సుధాకర్ రాజు, సంతోష్, సాయి తదితరులు పాల్గొన్నారు. వారు దేశాల భూపాల్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు సాగుతున్న దేశాల భూపాల్ సేవలు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని, భవిష్యత్తులో కూడా ప్రజల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని పలువురు ఆకాంక్షించారు.



# రెండు పడక గదుల ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలి: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హన్మకొండ, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

రెండు పడక గదుల ఇళ్ల సముదాయాల్లో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర మౌలిక వసతులను వెంటనే కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమలాపూర్ మండలంలోని గూడూరు, కమలాపూర్ గ్రామాల్లో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల సముదాయాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఇళ్లను త్వరితగతిన పంపిణీ చేసేలా అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గూడూరు, కమలాపూర్ సర్పంచ్‌లు వనజ, సతీష్, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ నాయక్, డీఆర్డీఓ శ్రీను, ఎంపీడీవో గుండె బాబు, తహసీల్దార్ సురేష్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: కలెక్టర్ డాక్టర్ సత్య శారద





**వరంగల్, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా నిర్వహించి, కొనుగోలు చేసిన వడ్లను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణితో కలిసి రైస్ మిల్లర్లు, కాంట్రాక్టర్లు, మండల ఏపీఎంలు (డీఆర్‌డీఏ), నోడల్ అధికారులు (డీసీఓ)లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ఓపీఎంఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో గన్ని సంచులు, రవాణా వాహనాల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమా, ఉమారాణి, జిల్లా రవాణా శాఖ అధికారి శోభన్ బాబు, డీఎంసీఎస్ సంధ్యారాణి, డీసీఎస్ఓ కిష్టయ్య, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, సంబంధిత అధికారులతో కలిసి బొల్లికుంట పీపీసీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీపీసీలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను శనివారం లోపే రైస్ మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు, రైతులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# వృద్ధురాలి మెడలో 5 తులాల బంగారం అపహరణ

**జనగామ, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పెద్దమడూరు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ దొంగతనం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కప్పరి యాదమ్మ అనే వృద్ధురాలు ఎండల కారణంగా ఇంటి బయట నిద్రిస్తుండగా గుర్తుతెలియని దొంగ ఆమె మెడలోని సుమారు 5 తులాల బంగారు గొలుసుతో పాటు నగదును అపహరించి పరారయ్యాడు. దొంగతనం అనంతరం హడావుడిగా పారిపోతున్న సమయంలో నిందితుడు తాను వచ్చిన బైక్‌తో పాటు చెప్పులను ఘటనాస్థలంలోనే వదిలివెళ్లినట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థలంలో లభించిన బైక్ నంబర్ ఆధారంగా కీలక ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు నిందితుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది.



# బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హన్మకొండ, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (ఎన్‌టీసీపీ)లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పొగాకు నియంత్రణ చట్టం (కోట్పా) జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు, గుట్కా తదితర పొగాకు ఉత్పత్తుల విక్రయం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయాలు, పాఠశాలలు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధించబడిందని పేర్కొంటూ, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతను భాగస్వామ్యం చేస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం వల్ల పరిసరాల్లో ఉన్నవారిపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నెల 31న నిర్వహించనున్న ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు, శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రామకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు పొగాకు వల్ల కలిగే అనర్థాలపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించేలా పాఠ్యాంశాలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో నిషేధిత బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో పొగాకు సాగును నియంత్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య జిల్లాలో అమలు చేస్తున్న పొగాకు నియంత్రణ కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జీడబ్ల్యూఎంసీ ముఖ్య వైద్యాధికారి డాక్టర్ రాజారెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# తెలంగాణలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం

**వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులు**

**నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, కొమురం భీమ్ జిల్లాల్లో వర్షాలు**

**ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు, మక్కలు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**




తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఈరోజు భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో రైతులు పంట నష్టపోయారు. పంట నీటిపాలు కావడంతో రైతులు ఆందోళన చెందారు. నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, కొమురంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్ తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అకాల వర్షాల కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని వడ్లు, మక్కలు తడిసి ముద్దయ్యాయి. పలు ప్రాంతాల్లో ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్, పెంబి మండలాలు, కొమురంభీమ్ జిల్లా కాగజ్ నగర్, కౌటాల మండలాల్లో అకాల వర్షాలతో ధాన్యం తడిసిముద్దయింది. ఇదిలా ఉండగా, పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.

# రైతులను వంచించడమే 'ప్రజా పాలన' నా? కొనుగోలు కేంద్రాల్లో ముక్కిపోతున్న వడ్లు: కాకులమర్రి లక్ష్మణ్ బాబు

**ఏటూరునాగారం వరి ధాన్యం జిసిసి ఐకేపీ కేంద్రాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు**

**స్థానిక మంత్రికి రైతుల కష్టాలు పట్టవా? ఒక్క పూట వచ్చి చూసే తీరిక లేదా అని ధ్వజం**





**ఏటూరునాగారం: మంగపేట 29: జై భీమ్ న్యూస్**

రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూ, క్షేత్రస్థాయిలో అన్నదాతలను వంచించడమే ప్రస్తుత ప్రభుత్వ "ప్రజా పాలన" నా? అని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏటూరునాగారంలోని వరి ధాన్యం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఈరోజు ఆయన సందర్శించి, గత 40 రోజులుగా ధాన్యం అమ్ముడుపోక నిరీక్షిస్తున్న స్థానిక రైతుల ఇబ్బందులను, వారి ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాకులమర్రి లక్ష్మణ్ బాబు మీడియాతో మాట్లాడుతూ స్థానిక మంత్రి అధికార యంత్రాంగం వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడిన ముఖ్యమైన అంశాలు మంత్రిగా మాటలకే పరిమితం – చేతల్లో శూన్యం స్థానిక మంత్రిగారు అధికారంలో ఉండిఏవేవో పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారే తప్ప, ఇక్కడ రైతులు పడుతున్న అసలు ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిన్ననే ఈ ప్రాంతానికి వచ్చిన మంత్రిగారు, ఒక్క పూటైనా ఈ కొనుగోలు కేంద్రానికి వచ్చి రైతుల పరిస్థితిని కళ్లారా చూసే తీరిక లేదా? అని ప్రశ్నించారు. వచ్చి చూడకుండానే వెళ్ళిపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులకు పైగా ధాన్యం నిల్వలు పేరుకుపోయి, అకాల వర్షాలకు తడిసి వడ్లన్నీ నల్లబడిపోతున్నాయని, ముక్కిపోతున్నాయని లక్ష్మణ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. "రైతు పండించిన పంట కళ్ల ముందే పాడవుతుంటే, ఈ వడ్లను కొనే నాథుడే లేడా?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రైతాంగ పక్షాన పోరాటం ప్రజా పాలన పేరిట రైతులను అగచాట్ల పాలు చేయడం సరికాదని, తక్షణమే కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, పాలకులు స్పందించి యుద్ధప్రాతిపదికన తూకాలు వేసి మిల్లులకు తరలించకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని కాకులమర్రి లక్ష్మణ్ బాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# తండ్రి-కూతురు గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం





**హన్మకొండ, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి విక్టరీ చర్చ్ ఆడిటోరియంలో "గిన్నిస్ అచీవర్స్ మీట్" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి సత్కరించారు. ఫిబ్రవరి 2, 2026న హైదరాబాద్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల పర్యవేక్షణలో నిర్వహించిన భారీ కీబోర్డ్ సంగీత కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన 2,000 మంది కీబోర్డ్ వాయిద్యకారులు గంటపాటు నిరంతరాయంగా వాయిస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభను ప్రదర్శించిన 777 మంది విద్యార్థులను ప్రత్యేకంగా ఎంపిక చేశారు. ఎంపికైన వారికి హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ దండింగి స్వయంగా సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అయినవోలు మండలం వనమాల కనపర్తి గ్రామానికి చెందిన సింగారపు రాజు, ఆయన కుమార్తె సింగారపు హెప్సిబా (10) పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు. తండ్రి--కూతురు ఇద్దరూ ఒకే వేదికపై అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందడం విశేషంగా నిలిచింది. సింగారపు రాజు కాజీపేట రైల్వే ఆపరేటింగ్ విభాగంలో పాయింట్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కుమార్తె హెప్సిబా హనుమకొండ ఫాతిమానగర్‌లోని సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతోంది. వీరి విజయంపై కాజీపేట స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, రైల్వే ఆపరేటింగ్ విభాగ సహోద్యోగులు, క్రైస్తవ హక్కుల రక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర, జాతీయ విభాగాల ప్రతినిధులు, బిషప్ డా. జన్ను యిర్మియా, గ్రామ సర్పంచ్ రిపిక ఎల్లస్వామి, కాంగ్రెస్ నాయకులు సింగారపు యాదగిరి, సింగారపు మాణిక్యం, మానుపాటి రాజు, పోలేపాక రవి, యువజన నాయకులు ఆర్. వినయ్, పోలేపాక వినయ్, సింగారపు చందర్, బొందుగుల సునీల్, సమ్మయ్య, సామ్రాట్ కుమార్, రాంచందర్, పవన్ రాజ్ తదితరులు అభినందనలు తెలిపారు. వనమాల కనపర్తి గ్రామానికి చెందిన తండ్రి--కూతురు గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించడం గ్రామానికి, జిల్లాకు గర్వకారణమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ ప్రతినిధులు



**హైద్రాబాద్, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషన్ ప్రధాన కమిషనర్, కమిషనర్లు శుక్రవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్‌లో బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసిన ప్రతినిధులు రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం అమలు, కమిషన్ నిర్వహిస్తున్న కార్యకలాపాలు, ప్రజలకు సమాచార హక్కు సేవల అందుబాటుపై వివరించారు. గత ఏడాది కాలంలో కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రజల నుంచి అందిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల గురించి కూడా ముఖ్యమంత్రికి నివేదించారు. సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ సేవల్లో మరింత పారదర్శకత తీసుకురావడంతో పాటు ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచేందుకు కమిషన్ చేపడుతున్న చర్యలను కూడా వివరించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్ జి. చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లు పీవీ శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్య రెడ్డి, దేశాల భూపాల్ ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి శుభాకాంక్షలు తెలియజేసి, సమాచార హక్కు చట్టం అమలులో కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించినట్లు సమాచారం.

## మారుమూల పల్లె నుంచి ప్రపంచ తెలుగు సాహిత్య వేదికపైకి..

**వరిపల్లి అనిల్ కుమార్‌కు ప్రత్యేక ఆహ్వానం**

**మహబూబాబాద్, 29 మే 2026 (జై భీమ్ న్యూస్)**



తెలుగు భాష, సాహిత్యంపై అభిరుచి, అంకితభావంతో ముందుకు సాగుతున్న మహబూబాబాద్ జిల్లాకు చెందిన యువ నాయకుడు, రచయిత వరిపల్లి అనిల్ కుమార్‌కు ప్రతిష్ఠాత్మకమైన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ ఆహ్వానం జిల్లాలోని సాహితీ వర్గాలతో పాటు యువతలో ఆనందాన్ని నింపింది. రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా జూన్ 6, 7 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్న 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో పాల్గొనాల్సిందిగా నిర్వాహకులు వరిపల్లి అనిల్ కుమార్‌ను ఆహ్వానించారు. దేశ విదేశాల నుంచి ప్రముఖ కవులు, రచయితలు, సాహితీవేత్తలు హాజరుకానున్న ఈ అంతర్జాతీయ సాహిత్య మహాసభల్లో మహబూబాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించడం విశేషంగా మారింది. చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో, అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ మహాసభలు నిర్వహించబడుతున్నాయి. తెలుగు భాషా వైభవాన్ని, సాహిత్య సంపదను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చైతన్య సారస్వత పరిషత్ అధ్యక్షులు కె.వి.వి. సత్యనారాయణరాజు (శ్రీ చైతన్యరాజు) సౌజన్యంతో, సాహిత్య భూషణ్ కత్తిమండ ప్రతాప్‌కుమార్ సారథ్యంలో నిర్వహించనున్న ఈ మహాసభలు తెలుగు భాషాభిమానులకు సాహిత్య పండుగగా నిలవనున్నాయి. "తెలుగు కేవలం భాష మాత్రమే కాదు.. అది ఒక జాతి సంస్కృతి" అనే భావనతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి హాజరు కావాలని శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు వరిపల్లి అనిల్ కుమార్‌ను సాదరంగా ఆహ్వానించారు. మారుమూల గ్రామం నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించి సాహిత్య రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన వరిపల్లి అనిల్ కుమార్‌కు ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల ఆహ్వానం రావడం జిల్లాకు గర్వకారణంగా మారింది. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి తెలుగు సాహిత్యానికి విశిష్ట సేవలు అందించాలని జిల్లా ప్రజలు, యువత, సాహితీ అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## తీవ్ర ఎండలకు మరో బలి.. వడదెబ్బతో వృద్ధురాలి మృతి

**హన్మకొండ, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**



తీవ్ర ఎండల ప్రభావంతో వడదెబ్బ తగిలి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన హనుమకొండ బస్టాండ్ 7వ డివిజన్ పరిధిలోని లక్ష్మీపురం ప్రాంతంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపురానికి చెందిన జనగాని అమృత (76) గురువారం సాయంత్రం పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బకు గురై మృతి చెందారు. ఇటీవల జిల్లాలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా ఆమె ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబీకులు తెలిపారు. వృద్ధురాలి మృతి వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె మృతితో లక్ష్మీపురం ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. ఇటీవల ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ కారణంగా మృతి చెందిన జనగాని అమృత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని తగిన ఆర్థిక సహాయం అందించాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. అలాగే వేసవి కాలంలో వడదెబ్బ నివారణపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## యువతకు వినియోగదారుల హక్కులు, ఆరోగ్య అవగాహనపై ప్రత్యేక సదస్సు





**కడప, 29 మే 2026 (జై భీమ్ న్యూస్)**

ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో కడప శివారులోని పాస్టల్ సెంటర్‌లో యువతీ యువకులకు వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివాహ జీవితానికి సంబంధించిన సూచనలు, సలహాలతో మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించి పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పాస్టల్ సెంటర్ డైరెక్టర్ రెవ. ఫా. వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అడ్మిన్ చైర్మన్, ఏపీ స్టేట్ ఫార్మసీ సంక్షేమ సంఘం చైర్మన్ డా. సురేష్ బాబు హాజరయ్యారు. అలాగే కడప జిల్లా ఎన్‌సీఆర్‌సీ చైర్మన్ కిషోర్, రెవ. ఫా. ప్రసాద్ రావు, రెవ. ఫా. శరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతీ యువకులను ఉద్దేశించి డా. సురేష్ బాబు మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి తన అవసరాల కోసం వస్తువులు లేదా సేవలను కొనుగోలు చేసి వినియోగించినప్పుడు అతను వినియోగదారుడిగా గుర్తించబడతాడని తెలిపారు. వినియోగదారుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రతి వినియోగదారుడికి భద్రత హక్కు, సమాచారం పొందే హక్కు, ఎంపిక చేసుకునే హక్కు, వినబడే హక్కు, పరిహారం పొందే హక్కు, వినియోగదారుల విద్య హక్కు వంటి మౌలిక హక్కులు ఉన్నాయని వివరించారు. హక్కులతో పాటు వినియోగదారులకు బాధ్యతలు కూడా ఉంటాయని, కొనుగోలు సమయంలో సరైన బిల్లులు తీసుకోవడం, వస్తువుల గడువు తేదీలను పరిశీలించడం, నకిలీ ఉత్పత్తులను గుర్తించడం, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం, అక్రమాలపై అధికారులకు సమాచారం అందించడం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వినియోగదారులు నష్టపోయిన సందర్భాల్లో కన్స్యూమర్ ఫోరమ్‌లను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని తెలిపారు. ఫిర్యాదుల దాఖలు విధానం, అవసరమైన పత్రాలు, పరిహారం పొందే ప్రక్రియపై కూడా వివరించారు. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయం పొందేందుకు కన్స్యూమర్ కోర్టులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం లైంగికంగా సంక్రమించే వ్యాధుల (ఎస్‌టీడీలు)పై అవగాహన కల్పిస్తూ, అసురక్షిత లైంగిక సంబంధాల వల్ల సంక్రమించే వ్యాధుల ప్రమాదాలు, వాటి నివారణ చర్యలపై యువతకు వివరించారు. ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది యువతీ యువకులు, సిస్టర్ సౌరీలు, సిస్టర్ సి.హెచ్. మేరీ, సిస్టర్ ప్రశాంతి, సిస్టర్ లిల్లీ పుష్ప, కస్పర్, లెక్చరర్ ప్రసన్న ఉమామహేశ్వరరావు, రాధాకృష్ణ, బాలకృష్ణ, చలపతి సుబ్బారెడ్డి, బద్వేల్ సురేష్, చంద్రశేఖర్, శివకుమార్, కోట సుబ్బారావు, సుబ్బారాయుడు, శ్రీధర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామాలుగా గ్రామపంచాయతీలను తీర్చిదిద్దాలి

**డంపింగ్ నిర్వహణ, వ్యర్థాల సెగ్రిగేషన్ సమర్థవంతంగా ఉండాలి**
**ప్రతి మండలంలో 3 నుంచి 5 మోడల్ గ్రామపంచాయతీల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలి**
**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హన్మకొండ, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో గ్రామీణ పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరుస్తూ, ప్రతి మండలంలో కనీసం మూడు నుంచి ఐదు గ్రామపంచాయతీలను ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమలాపూర్ మండలం శనిగరం గ్రామపంచాయతీ పరిధిలోని సెగ్రిగేషన్ షెడ్, డంపింగ్ యార్డును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో చెత్త సేకరణ, వ్యర్థాల వర్గీకరణ, కంపోస్టు తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంపోస్టు ఎరువును ఎలా తయారు చేస్తున్నారని, తయారైన ఎరువును ఎక్కడ వినియోగిస్తున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. అలాగే ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థ పదార్థాలను ఎక్కడ విక్రయిస్తున్నారని, వాటి ద్వారా గ్రామపంచాయతీకి ఎంత మేర ఆదాయం లభిస్తోందని పంచాయతీ కార్యదర్శి ప్రవల్లిక, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్‌లను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణకు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో డంపింగ్ యార్డులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ప్రతి మండలంలో కనీసం మూడు నుంచి ఐదు గ్రామపంచాయతీలను మోడల్ గ్రామపంచాయతీలుగా ఎంపిక చేసి అభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన నివేదికను వచ్చే నెల 15వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణలో శనిగరం గ్రామపంచాయతీ ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి రాజు, డీఆర్డీఓ మేన శ్రీను, ఎంపీడీవో బాబు, తహసీల్దార్ సురేష్ కుమార్, పంచాయతీ సిబ్బంది, ఇతర అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# అగ్నికి ఆహుతైన తాటి వనం





## 300కు పైగా తాటి చెట్లు బూడిద

**గౌడ కుటుంబాల ఉపాధిపై తీవ్ర ప్రభావం**
**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం.. బాధితులకు పరిహారం,**
**దర్యాప్తు చేపట్టాలని డిమాండ్**
**మంటల్లో మృతి చెందిన మూగజీవాలు.. కలచివేస్తున్న దృశ్యాలు**

**కమలాపూర్, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామం నుంచి నేరెళ్ల వెళ్లే ప్రధాన రహదారి సమీపంలోని తాటి వనం అగ్నికి ఆహుతై బూడిద కుప్పగా మారింది. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ తాటి తోటలో 300కు పైగా తాటి చెట్లు పూర్తిగా దగ్ధమవడంతో గౌడ కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. తరతరాలుగా తాటి చెట్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ఈ ఘటన కోలుకోలేని నష్టాన్ని మిగిల్చింది. అగ్నిప్రమాదం అనంతరం అక్కడి పరిస్థితులు హృదయ విదారకంగా మారాయి. పచ్చగా కళకళలాడిన తాటి వనం ఇప్పుడు నల్లటి బూడిదతో కప్పబడి కనిపిస్తోంది. మంటల ధాటికి తాటి చెట్లతో పాటు వనంలో ఆశ్రయం పొందిన పాములు, తాబేళ్లు, పక్షులు, ఇతర చిన్న జీవాలు సైతం ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు చెబుతున్నారు. కాలిపోయిన పాము అవశేషాలు కనిపించడం ఈ ఘటన తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రకృతి సంపదతో పాటు జీవ వైవిధ్యం కూడా ఈ ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతిన్నది. గురువారం జరిగిన ఈ ఘటనకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే నిప్పంటించారా..? లేక నిర్లక్ష్యంగా పడేసిన సిగరెట్ కారణంగా మంటలు వ్యాపించాయా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగినప్పటికీ ఇప్పటివరకు సంబంధిత శాఖలు పూర్తి స్థాయి విచారణ ప్రారంభించకపోవడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, వందలాది తాటి చెట్లు దగ్ధమై గౌడ కుటుంబాలు ఉపాధి కోల్పోయినప్పటికీ రెవెన్యూ, అటవీ, అగ్నిమాపక శాఖల అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించిన దాఖలాలు కనిపించకపోవడం. అధికారులు స్పందించడంలో జాప్యం చేయడంపై గౌడ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తాటి చెట్లు కేవలం వృక్షాలు మాత్రమే కావని, అవి గౌడ కుటుంబాల జీవనాడి అని సంఘ నాయకులు పేర్కొంటున్నారు. ఒక తాటి చెట్టు ఎదగడానికి ఎన్నో సంవత్సరాలు పడుతుందని, కానీ ఒక్క అగ్నిప్రమాదంతో వందలాది చెట్లు నాశనమై కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని



ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబాలకు ప్రత్యేక పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, అటవీ శాఖ, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, అగ్నిప్రమాదానికి కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే తాటి వనాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "తాటి వనం కాలిపోవడం అంటే చెట్లు కాలిపోవడం మాత్రమే కాదు.. గౌడ కుటుంబాల ఆశలు, ఉపాధి, ప్రకృతి సంపద కూడా బూడిద కావడమే" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రౌడీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలి: సీపీ సన్‌ప్రీత్ సింగ్





**వరంగల్, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్ల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కిట్స్ కళాశాలలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు వంద శాతం హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా ఒకసారి స్టేషన్ అధికారులు వ్యక్తిగతంగా రౌడీ షీటర్ల ఇళ్లను సందర్శించి వారి పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు, అందుబాటులో లేని వారి కదలికలపై సమాచారం సేకరించాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి వేళల్లో బెల్ట్ షాపులను మూసివేయించేలా చర్యలు చేపట్టాలని, నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేయడం లేదా బైండోవర్ చేయాలని సూచించారు. అధిక రద్దీ ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. రోడ్లపై జన్మదిన వేడుకలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చోరీల నియంత్రణ కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇళ్లలో, వ్యాపార సంస్థల్లో పనిచేసే వ్యక్తులు, హాస్టళ్ల నిర్వహకుల వివరాలను స్థానిక పోలీసులు సేకరించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి ఉదయం 9 గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉండాలని, నేరస్థుల అరెస్టులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాల చోరీలకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే కేసులు నమోదు చేయాలని, పెట్రోలింగ్ వాహనాల పనితీరును క్షేత్రస్థాయిలో సమీక్షించాలని సూచించారు. "మీ ఉద్యోగానికి మీరు న్యాయం చేస్తే ప్రజలకు న్యాయం చేసినట్లే" అని సీపీ పేర్కొన్నారు. అనంతరం పెండింగ్ కేసులు, నేరస్తుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీపీలు అకింత్ కుమార్, దారా కవిత, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్ రావు, బాలస్వామి, సురేష్ కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సెక్స్ వర్క్ నేరం కాదు: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**వయోజనులకు జీవనోపాధి ఎంపిక హక్కు ఉంది**
**సెక్స్ వర్కర్లపై పోలీసు వేధింపులు తగవు**
**గౌరవప్రద జీవితం వారి రాజ్యాంగ హక్కు**
**బలవంతపు వ్యభిచారం, అక్రమ రవాణా మాత్రం నేరమే**
**ప్రైవసీ, మానవ హక్కులను కాపాడాలని ఆదేశం**

**ఢిల్లీ, మే 29 (జై భీమ్ న్యూస్):**

స్వచ్ఛందంగా వేశ్యావృత్తి (సెక్స్ వర్క్) ఎంచుకోవడం నేరం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వయోజనులు తమ ఇష్టపూర్వకంగా ఈ వృత్తిని చేపట్టే హక్కు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-21 కల్పించిన జీవించే హక్కులో భాగమని పేర్కొంది. జస్టిస్ జె.బి. పర్దివాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ జరిపి కీలక వ్యాఖ్యలు చేసింది. 18 సంవత్సరాలు నిండిన వ్యక్తులను వయోజనులుగా పరిగణిస్తామని, వారు స్వచ్ఛందంగా ఎంచుకున్న జీవనోపాధిని గౌరవించాలని స్పష్టం చేసింది. సెక్స్ వర్కర్లు కూడా భారత రాజ్యాంగం ప్రకారం గౌరవం, సమాన రక్షణ, మానవ హక్కులు పొందే అర్హత కలిగిన పౌరులేనని ధర్మాసనం పేర్కొంది. స్వచ్ఛందంగా ఈ వృత్తిలో కొనసాగుతున్న వారిని పోలీసులు వేధించడం, అనవసరంగా అరెస్టు చేయడం లేదా శిక్షించడం చేయరాదని ఆదేశించింది. అలాగే, దాడులు (రైడ్స్) నిర్వహించిన సమయంలో సెక్స్ వర్కర్లను బలవంతంగా రెస్క్యూ హోమ్స్ లేదా షెల్టర్ హోమ్స్‌కు తరలించకూడదని స్పష్టం చేసింది. వారి ఇష్టానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడం హక్కుల ఉల్లంఘన అవుతుందని పేర్కొంది. అయితే, వ్యభిచార గృహాల నిర్వహణ, ఇతరులను బలవంతంగా ఈ వృత్తిలోకి దించడం, మానవ అక్రమ రవాణా వంటి చర్యలు చట్టరీత్యా నేరాలేనని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. కండోమ్‌లు కలిగి ఉండటాన్ని నేరానికి ఆధారంగా పరిగణించరాదని, సెక్స్ వర్కర్ల వ్యక్తిగత గోప్యత (ప్రైవసీ)కు భంగం కలిగించేలా పోలీసులు వ్యవహరించవద్దని ధర్మాసనం సూచించింది. ఈ తీర్పు సెక్స్ వర్కర్ల హక్కులు, గౌరవప్రద జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణకు సంబంధించి కీలక మార్గదర్శకంగా భావిస్తున్నారు.



## పిల్లల జీవితంలో మొదటి 1000 రోజులు అత్యంత కీలకం: కలెక్టర్ డా. సత్య శారద




**వరంగల్, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

పిల్లల జీవితంలో మొదటి 1000 రోజులు వారి భవిష్యత్తుకు బలమైన పునాదిని వేస్తాయని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పేర్కొన్నారు. ప్రజాపాలన–-ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక)లో భాగంగా వరంగల్ మండలం పైడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "బలమైన బాల్యానికి వెయ్యి మెట్లు" కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించడం ఎంతో అవసరమని సూచించారు. గర్భధారణ ప్రారంభమైన రోజు నుంచి చిన్నారికి రెండేళ్లు పూర్తయ్యే వరకు ఉండే కాలం పిల్లల శారీరక, మానసిక, భావోద్వేగ, మేధో వికాసానికి అత్యంత కీలకమని వివరించారు. తల్లి--శిశు సంరక్షణ, సరైన పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, టీకాలు, ప్రేమతో కూడిన సంరక్షణ, ప్రారంభ బాల్యాభివృద్ధి అంశాలపై కలెక్టర్ అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలతో పాటు సమగ్ర అభివృద్ధికి మొదటి 1000 రోజుల కాలాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. కార్యక్రమంలో భాగంగా పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కార్తీక్ ఆలనా పాలనకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించి, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులకు మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎర్లీ చైల్డ్ డెవలప్‌మెంట్‌లో భాగంగా స్థానికంగా లభించే తక్కువ ఖర్చు వనరులతో ఆటబొమ్మలు, అభ్యాస సామగ్రి తయారీపై ప్రదర్శనలు నిర్వహించారు. పిల్లల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించే పద్ధతులపై తల్లిదండ్రులు, సంరక్షకులకు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు తయారు చేసిన తక్కువ ఖర్చుతో కూడిన ఆటబొమ్మలు, అభ్యాస సామగ్రి, ప్రారంభ బాల్యాభివృద్ధికి సంబంధించిన ప్రదర్శనలను ప్రత్యేక స్టాల్స్‌లో ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ స్టాల్స్‌ను సందర్శించి అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, ఎంఆర్వో శ్రీకాంత్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సాంబశివరావు, జిల్లా సంక్షేమ అధికారి బి. రాజమణి, సీడీపీవో పి. విద్య, సూపర్వైజర్ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్-2026 ప్రక్రియకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

**ఓటర్లకు సహాయం అందించేందుకు ప్రత్యేక చర్యలు**
**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హన్మకొండ, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026)ను మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపులు, చిరునామా మార్పు, ఇతర ఎన్నికల సంబంధిత సేవలకు సంబంధించిన సందేహాలు నివృత్తి చేయడంతో పాటు ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు ఈ హెల్ప్‌డెస్క్‌లు ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీ ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బంది ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా స్థాయితో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియకు సంబంధించిన వివరాలు, ఫిర్యాదులు, సవరణలు మరియు సాంకేతిక సహాయం కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి హెల్ప్‌డెస్క్‌లో ఐటీ సపోర్ట్ అధికారి బి. శ్రీనివాస్ (9885327178), కంప్యూటర్ ఆపరేటర్ టి. శ్రీనాథ్ (9701297988) అందుబాటులో ఉంటారని తెలిపారు. అదేవిధంగా 1800-425-1126, 9701777182 హెల్ప్‌డెస్క్ నంబర్ల ద్వారా కూడా సేవలు పొందవచ్చన్నారు. పరకాల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఎన్నికల ఆపరేటర్ బి. రాంబాబు (9966401958), పరకాల తహసీల్దార్ కార్యాలయంలో ఎస్. భద్రయ్య (8639823118), ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎస్. రాజు (9640758583), దామెర తహసీల్దార్ కార్యాలయంలో బి. శ్రీమతి (9063063433), నడికూడ తహసీల్దార్ కార్యాలయంలో కె. భాను ప్రసాద్ (8688874683), గీసుగొండ తహసీల్దార్ కార్యాలయంలో ఈ. సందీప్ (8297566439), ఖిలా వరంగల్ డిప్యూటీ తహసీల్దార్ కార్యాలయంలో ఎస్. సతీష్ (9908521810) ఓటర్లకు సహాయం అందించనున్నారు. వరంగల్ వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో హనుమకొండ ఆర్డీవో కార్యాలయంలో సిహెచ్. రాజు (8106102219), హనుమకొండ తహసీల్దార్ కార్యాలయంలో ముస్కే వెన్నెల (7702069129), ఖాజీపేట్ తహసీల్దార్ కార్యాలయంలో కె. స్వామి (8985233374), జీడబ్ల్యూఎంసీ ఖాజీపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో నరహరి (9866727962) ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియకు సంబంధించిన సమాచారం, సవరణలు, ఫిర్యాదులు, ఇతర ఎన్నికల సేవల కోసం ప్రజలు తమకు సమీపంలోని హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించి సేవలు పొందాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.

జై భీమ్ POWER OF PEOPLE

# ఘనంగా టీపీటీఎఫ్ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వరంగల్, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం కిలా వరంగల్ చమన్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల వీరస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రమేష్ మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీటీఎఫ్‌గా కొనసాగిన సంఘం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్‌గా రూపాంతరం చెంది ఉపాధ్యాయ, విద్యారంగ, సామాజిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. సంఘం చేపట్టిన ఉద్యమాల ఫలితంగా అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని పేర్కొంటూ, గత పోరాటాల స్ఫూర్తితో ముందుకు సాగి ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం టీపీటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత పెద్దోజు నాగభూషణం సేవలను స్మరించడంతో పాటు అమరులైన ఉపాధ్యాయులకు నివాళు లర్పించారు. సీనియర్ నాయకుడు పాలకుర్తి సత్యం మాట్లాడుతూ ఫెడరేషన్ త్యాగాల పునాదులపై నిర్మితమైందని, సంఘ బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు జె. స్వామి మాట్లాడుతూ చమన్ సెంటర్‌లో టీపీటీఎఫ్ జెండా గద్దె నిర్మించి, 2027 ఆవిర్భావ వేడుకలను అక్కడే



నిర్వహించాలని సూచించారు. జిల్లా కార్యదర్శి మానుపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీపీటీఎఫ్ ఆవిర్భావం వరంగల్ జిల్లా కేంద్రంగా జరిగినందున సంఘ భవన నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బీమల్ల సారయ్య, బాలబోయిన జగన్మోహన్, మల్లికార్జున్, కొమురయ్య, కనకస్వామి, కల్వచర్ల మోహన్‌రావు, నియామతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి కిలా వరంగల్ మండల శాఖ అధ్యక్షుడు బెల్లంకొండ పూర్ణచందర్ వందన సమర్పణ చేశారు.

## కేయూ వీసీని మర్యాదపూర్వకంగా కలిసిన మై భారత్ రాష్ట్ర డైరెక్టర్ అన్వేశ్



**హన్మకొండ, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర మై భారత్ స్టేట్ డైరెక్టర్ సీహెచ్. అన్వేశ్, కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డిని శుక్రవారం వైస్ ఛాన్సలర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ నుంచి పదోన్నతిపై రాష్ట్ర స్థాయి అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అన్వేశ్‌ను ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ అభినందించారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సహకారంతో నిర్వహించాల్సిన కార్యక్రమాలు, గతంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలు, భవిష్యత్తులో అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమాలను విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్‌తో అనుసంధానం చేస్తూ సంయుక్త కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా మై భారత్ హనుమకొండ జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భూక్యా సంజీవ్ కూడా వైస్ ఛాన్సలర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయ స్థాయిలో 11 యూత్ పార్లమెంట్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణను వైస్ ఛాన్సలర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, పాలక మండలి సభ్యుడు ఆచార్య బి. సురేష్ లాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





**హన్మకొండ, 29 మే 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ)--మెప్మా హనుమకొండ ఆధ్వర్యంలో బొక్కలగడ్డలోని సిటిజన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహిళా సమైక్య సంఘాల 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సమైక్య గ్రూపుల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించుకుని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకుంటున్న మహిళలను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం పలు సంక్షేమ, ఆర్థికాభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరాలంటే క్షేత్రస్థాయిలో పనిచేసే ఆర్పీలు, మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ ప్రజలకు ప్రభుత్వ సహాయం అందేలా మహిళా సంఘాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పార్టీలకు అతీతంగా ప్రజాసేవ చేస్తున్న మహిళా సంఘాలకు ఎల్లప్పుడూ తన మద్దతు ఉంటుందని, స్థానిక ఎమ్మెల్యేగా మహిళా సమైక్య సంఘాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ఓబీసీ చైర్మన్ బొమ్మతి విక్రమ్, డివిజన్ అధ్యక్షుడు శివాజీ, మెప్మా అధికారులు, కార్పొరేటర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## డ్యాన్స్‌తో అదరగొట్టిన బాలయ్య చిన్న కూతురు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

నందమూరి నటసింహం, ఎమ్మెల్యే బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని తన డ్యాన్స్ టాలెంట్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఓ పాటకు ఆమె వేసిన స్టెప్పులకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. సాధారణంగా ప్రచారానికి, సినిమా వెలుగులకు దూరంగా ఉండే తేజస్విని.. ఇంత గొప్పగా డ్యాన్స్ చేయడంతో నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ వీడియోలో, ఓ పాపులర్ పాటకు తేజస్విని ఎంతో సమన్వయంతో, ఉత్సాహంగా స్టెప్పులు వేశారు. తేజస్విని ముఖంలో చక్కటి హుందాతనం, ఎనర్జీ కనిపించాయి. ఆమె హుషారైన డ్యాన్స్ తాజాగా, చూడముచ్చటగా ఉందని సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. 66 ఏళ్ల వయసులోనూ తన ఎనర్జిటిక్ డ్యాన్సులతో ప్రేక్షకులను ఉర్రూతలూగించే బాలయ్యకు తేజస్విని కూతురు కావడంతో, ఆమెకు ఈ టాలెంట్ రావడం సహజమేనని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. గతంలో తేజస్విని ఓ టెలివిజన్ యాడ్‌లో కనిపించినప్పటికీ, నటన వైపు రాలేదు. ఇప్పుడు ఈ డ్యాన్స్ వీడియోతో నందమూరి కుటుంబంలో మరో టాలెంట్ బయటపడిందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ప్రముఖ విద్యావేత్త, మాజీ టీడీపీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి మనవడైన శ్రీ భరత్‌ను తేజస్విని దశాబ్దం క్రితం వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి కుటుంబ కార్యక్రమాలకు మాత్రమే పరిమితమైన తేజస్విని, ఇలా అకస్మాత్తుగా తనలోని డ్యాన్స్ ప్రతిభను బయటపెట్టడం నందమూరి అభిమానులకు ఆనందాన్ని పంచుతోంది.

## ముగిసిన బండి భగీరథ్ పోలీసు కస్టడీ.. జైలుకు తరలింపు

**మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్టు భగీరథ్ పై ఆరోపణలు**
**భగీరథ్ పై పోక్సో కేసు పెట్టిన పోలీసులు**
**మూడు రోజుల పాటు భగీరథ్ ను ప్రశ్నించిన పోలీసులు?**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారు బండి భగీరథ్ పోలీసు కస్టడీ ముగిసింది. భగీరథ్ ను పోలీసులు మూడు రోజుల పాటు విచారించారు. విచారణ ముగియడంతో భగీరథ్ ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ కేసు ప్రత్యేక విచారణాధికారి, కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో పోలీసులు భగీరథ్ ను విచారించారు. సీన్ రీకన్స్ట్రక్షన్ చేసేందుకు మొయినాబాద్ ఫామ్ హౌస్ కు కూడా ఆయనను తీసుకెళ్లారు. డిసెంబర్ 31న బాధితురాలిని భగీరథ్ తన స్నేహితులతో కలిసి ఫామ్ హౌస్ కి తీసుకెళ్లి అఘాయిత్యం చేసినట్టు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అయితే పోలీసు విచారణలో పలు ప్రశ్నలకు భగీరథ్ సమాధానాలు చెప్పకుండా మౌనంగా ఉన్నట్టు సమాచారం.

## ప్రతి ఓటును కాపాడుకోవాలి: మహేశ్ కుమార్ గౌడ్

**ఎస్ఐఆర్ సమయంలో అనుసరించాల్సిన తీరుపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్**
**హాజరైన మీనాక్షి నటరాజన్ తదితర నేతలు**
**బెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారన్న మహేశ్ గౌడ్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**




దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మిగిలిపోయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియను ఈసీ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియ సమయంలో అనుసరించాల్సిన తీరుపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తమ నేతలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గాంధీ భవన్ ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ మాస్టర్ ట్రైనీలకు ఏఐసీసీ శిక్షణ విభాగానికి సంబంధించిన సౌరభ్, అనూష, నిశాంత్ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనీలు రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో బీఎల్ఏలకు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ ప్రక్రియను పకడ్బందీగా చేశామని వెల్లడించారు. జిల్లా కమిటీలు, మండల కమిటీలు దాదాపు పూర్తి చేశామని చెప్పారు. పశ్చిమబెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారని.. బీజేపీ చేసిన కుట్రలతో అక్కడ ప్రభుత్వమే మారిపోయిందని మండిపడ్డారు. తెలంగాణలో అలాంటి కుట్రలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు.

## తెలంగాణలో ఉండాలంటే వీసా కావాలా?.. సీఎం రేవంత్‌కు ఏపీ బీజేపీ నేత సూటి ప్రశ్న

**తెలంగాణలో ఉండాలంటే పాస్‌పోర్ట్, వీసా కావాలా ం**
**అని బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్న**
**సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ను బెదిరించిన ఎమ్మెల్యే**
**సామేల్‌పై కేసు పెట్టాలని డిమాండ్**
**హైదరాబాద్‌లో ఏపీ నేతల పెత్తనం ఏంటని ప్రశ్నించిన కాంగ్రెస్**
**ఎమ్మెల్యే మందుల సామేల్**
**ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేస్తారనే ప్రచారంతో**
**మొదలైన వివాదం**
**ఐదు కోట్ల ఆంధ్రులను అవమానించడం న్యాయమేనా?**
**అని విష్ణువర్ధన్ రెడ్డి ఆవేదన**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు సంబంధించిన వివాదం తెలుగు రాష్ట్రాల మధ్య రాజకీయ దుమారం రేపుతోంది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలకు ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి గట్టిగా బదులిచ్చారు. "తెలంగాణలో బతకాలంటే ప్రత్యేక పాస్‌పోర్ట్, వీసా ఏమైనా కావాలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు?" అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను ఉద్దేశించి 'వెంటనే జూబ్లీహిల్స్ వదిలి వెళ్లిపోవాలి' అంటూ బెదిరింపులకు దిగిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలని తెలంగాణ డీజీపీని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఒక ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులకే ఇలాంటి బహిరంగ బెదిరింపులు వస్తే, ఇక తెలంగాణలో సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఐదు కోట్ల మంది ఆంధ్రులను అవమానించడమేనని అన్నారు. తెలంగాణ ప్రజలు అందరినీ ప్రేమించే వారని, కానీ కొందరు రాజకీయాల కోసం రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వివాదానికి నేపథ్యం ఇదే..

మూడు రోజుల క్రితం ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు హైదరాబాద్ వచ్చారంటూ ప్రచారం జరిగింది. దీనిపై కొందరు జర్నలిస్టులతో కలిసి తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ స్పందించారు. చంద్రబాబు, పవన్‌లకు హైదరాబాద్‌లో ఏం పని అని ప్రశ్నించారు. తెలంగాణ మేధావులపై అరాచకాలు సాగవని హెచ్చరించారు. బతకడానికి తెలంగాణకు వచ్చిన వారు పద్ధతిగా ఉండాలని, పెత్తనం చెలాయిస్తామంటే ఊరుకునేది లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 60 ఏళ్లు పోరాడి సాధించుకున్న తెలంగాణలో మళ్లీ ఆంధ్రా నేతలకు వ్యతిరేకంగా పోరాటం వస్తుందని ఆయన హెచ్చరించడంతో ఈ వివాదం ముదిరింది.

## పవన్ ఒక ప్యాకేజ్ స్టార్..

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్‌ను ఒక 'ప్యాకేజ్ స్టార్' అని అభివర్ణిస్తూ, భవిష్యత్తులో వైఎస్ జగన్ ఎక్కువ ప్యాకేజీ ఇస్తే ఆయనకు మద్దతు ఇవ్వడానికి కూడా వెనుకాడరని ఎద్దేవా చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను విమర్శించే స్థాయి, అర్హత పవన్ కల్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి అన్నారు. "దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయండి. ఆయన ఇంటి ముందు నేను అడ్డుగా నిలబడతా" అంటూ పవన్‌కు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ బిడ్డల జోలికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరైనా రావాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే మళ్లీ 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మొదలవుతుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

# షుగర్ ఫ్రీ స్నాక్స్ ఆరోగ్యానికి మంచిదా?




కాలం మారుతున్న కొద్దీ మనం తినే ఆహారంలో కూడా విషపూరిత అంశాలు చేరిపోతున్నాయి. మనం రోజూ తినే ఆహారమే నేడు మనిషి ఎదుర్కొంటున్న అనేక వ్యాధులకు కారణం. మొదట్లో, చెడుకు బానిసలుగా ఉన్నవారు మాత్రమే అనారోగ్యానికి గురవుతారు. అయితే ఇప్పుడు మనం తినే ఆహారంలో కాస్త మార్పు వచ్చినా గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో షుగర్, స్థూలకాయం, క్యాన్సర్ వంటి సమస్యలు పంచదారతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వస్తాయని చెప్పారు. అందువల్ల, చాలా మంది ప్రజలు చక్కెర ఆహారాలకు దూరంగా ఉండటం , చక్కెర లేని ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని గడుపుతున్నారని అనుకుంటారు. అయితే మనం అనుకున్నట్లుగా చక్కెర రహిత ఉత్పత్తులు నిజంగా ఆరోగ్యానికి మంచివేనా? దీని గురించి నిపుణులు ఏమంటారు? పేరు సూచించినట్లుగా, చక్కెరను ఉపయోగించకుండా చక్కెర రహిత ఉత్పత్తులు తయారు చేయబడతాయి . కానీ తీపి రుచిని అందించడానికి తక్కువ కేలరీలతో ప్రత్యామ్నాయ స్వీటెనర్లను ఉపయోగిస్తారు. అస్పర్టమే సాధారణంగా అటువంటి చక్కెర రహిత ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. వీటిని సాధారణంగా చూయింగ్ గమ్ , బేకింగ్ సోడాలో ఉపయోగిస్తారు. అస్పర్టమే కాకుండా, సాచరిన్ , సుక్రలోజ్ కూడా సాధారణంగా చక్కెర రహిత ఉత్పత్తులలో కనిపిస్తాయి. ఇప్పుడు మన ముందున్న ప్రశ్న ఏమిటంటే, చక్కెరను ఉపయోగించకుండా తయారు చేసే ఈ షుగర్ ఫ్రీ ఉత్పత్తుల వినియోగం నిజంగా ఆరోగ్యానికి మంచిదేనా, పోషకాహార నిపుణుడు అమిత గాద్రే ప్రకారం, చక్కెర కంటెంట్ వినియోగంతో పోలిస్తే చక్కెర లేని స్వీట్లు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే. ఉత్పత్తులు. కానీ షుగర్ లేదనే కారణంతో ఎక్కువగా తినడం ప్రారంభిస్తే సమస్యలు వస్తాయి. పండుగల సమయంలో తరచుగా భోజనం చేయడంలో తప్పులేదు. ప్రతిరోజూ షుగర్ ఫ్రీ ఉత్పత్తులను తీసుకోవడం ఖచ్చితంగా మంచిది కాదు. షుగర్ ఫ్రీ క్యాండీలలో కూడా మీరు జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే వాటిలో మీ క్యాలరీలను పెంచే ఇతర పదార్థాలు ఉంటాయి. అమిత ప్రకారం, మీరు వారానికి ఒకసారి చక్కెర లేని ఉత్పత్తిని తీసుకోవచ్చు. మిఠాయిల కోసం మార్కెట్లకు వెళ్లినప్పుడు రెండు రకాల స్వీట్లు దొరుకుతాయి. ఒకదానిలో షుగర్ వాడలేదని రాసి ఉండగా, మరో దానిలో షుగర్ ఫ్రీ అని రాసి ఉంది. మంచి ఆరోగ్యం విషయంలో దేన్ని ఎంచుకోవాలి అనే విషయంలో వినియోగదారులుగా మనం అయోమయం చెందడం సర్వసాధారణం. అయితే రెంటికి ఏమైనా తేడా ఉందా? లేక వీరిద్దరూ మిఠాయిల కోవకు చెందినవారే అనే సందేహం రావడం సహజం. వారు చక్కెరను ఉపయోగించరు లేదా చక్కెర రహితంగా లేబుల్ చేయబడిన ఉత్పత్తులలో చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఏ ఇతర ఉత్పత్తిని ఉపయోగించరు. కానీ ఆ మిఠాయిని తయారు చేయడానికి ఉపయోగించే ఇతర పదార్థాలు తీపి భాగం కలిగి ఉండవచ్చు. కానీ షుగర్ ఫ్రీ ఉత్పత్తులలో చక్కెర ఉండదు. బదులుగా, అస్పర్టమే, సాచరిన్ , సుక్రలోజ్ వంటి పైన పేర్కొన్న పదార్థాలు ఉపయోగించబడతాయి. వీటిలో ఏది తినాలనేది మన ఇష్టం.

## ఈ టీలు తాగితే చాలు.. బెల్లీ ఫ్యాట్ కరిగిపోవడం ఖాయం!



ప్రస్తుత రోజుల్లో స్త్రీ పురుషులు చాలామంది అధిక బరువు బెల్లీ ఫ్యాట్ సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. వీటి కారణంగా చాలామంది వారి సొంత పనులు చేసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతూ ఉంటారు.కొన్ని కొన్ని సార్లు ఈ బెల్లీ ఫ్యాట్ కారణంగా బాడీ షేమింగ్ కామెంట్స్ ని కూడా ఎదుర్కోవాల్సి వస్తూ ఉంటుంది. అయితే ఈ బెల్లీ ఫ్యాట్ ని కరిగించుకోవడం కోసం కొన్ని రకాల టీలు బాగా ఉపయోగపడతాయి అని చెబుతున్నారు. ఇంతకీ ఆ టీ లు ఏవి అన్న విషయానికి వస్తే.. బరువు తగ్గడానికి ఉపయోగించే తీలను స్లిమ్మింగ్ టీలు అని పిలుస్తారు. ఈ స్లిమ్మింగ్ టీకి దాని ప్రభావాన్ని అందించే రెండు ప్రాథమిక పదార్థాలు కెఫిన్ , పాలీఫెనాల్స్. అదనపు ట్రైగ్లిజరైడ్‌లను కరిగించే నిర్దిష్ట ఎంజైమ్‌ను ప్రేరేపించడం ద్వారా, పాలీఫెనాల్స్ భాగం శరీరంలో అధిక ట్రైగ్లిజరైడ్ ఏర్పడే ప్రమాదాన్ని తొలగిస్తుందట. అలాగే శరీరంలో కొవ్వును సైతం కరిగిస్తుందని చెబుతున్నారు. కాగా స్లిమ్మింగ్ టీ తాగడం వల్ల జీవక్రియ రేటును పెంచడంలో సహాయపడుతుందట. ఇది శరీరంలో కొవ్వును చాలా తొందరగా కరిగిస్తుందని, ఇది వినియోగించే కేలరీల పరిమాణాన్ని కూడా తగ్గిస్తుందని చెబుతున్నారు. కార్బోహైడ్రేట్లు, చక్కెరలను కొవ్వుగా మార్చకుండా శరీరాన్ని నిరోధిస్తుందట. ఇది శరీరంలో ని కొవ్వు పరిమాణాన్ని తగ్గిస్తుందని, మీరు బరువు తగ్గడానికి కొన్ని సులభమైన కార్యకలాపాలతో స్లిమ్మింగ్ టీని కూడా తాగేస్తే, సులభంగా బరువు తగ్గవచ్చని చెబుతున్నారు వైద్యులు. బయట మార్కెట్లో మనకు అనేక రకాల స్లిమ్మింగ్ టీలు అందుబాటులో ఉన్నాయి. వాటిని తాగడం వల్ల ఈజీగా మీరు అధిక బరువుతో పాటు బెల్లీ ఫ్యాట్ ని కూడా కరిగించుకోవచ్చు.

## ఈ ఫేస్ ప్యాక్ ట్రై చేస్తే చాలు.. నిముషాల్లో స్కిన్ మెరిసిపోవాల్సిందే!

చాలామంది స్త్రీ పురుషులు అందంగా కనిపించడం కోసం వేలకు వేలు డబ్బులు ఖర్చు చేస్తూ ఉంటారు. బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరుగుతూ, రకరకాల బ్యూటీ ప్రోడక్టులు ఉపయోగిస్తూ ఉంటారు. ఇంకొందరు సహజంగా కనిపించే అందం కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. కొందరు ఫంక్షన్ల కోసం నిమిషాల్లోనే మెరిసిపోయే స్కిన్ కావాలని కోరుకుంటూ ఉంటారు. మరి అలాంటి వాళ్ళు ఎటువంటి ఫేస్ ప్యాక్ ట్రై చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. అందులో మొదటిది శనగపిండి, పసుపు ఫేస్ ప్యాక్ కూడా ఒకటి. ఈ ప్యాక్ చేయడానికి మీరు రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండి, ఒక టీస్పూన్ పసుపు పొడిని కలపాలి. పేస్ట్ చేయడానికి పాలు లేదా రోజ్ వాటర్ ఉపయోగించవచ్చు. దీన్ని మీ ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత శుభ్రం చేస్తే సరిపోతుందట. మరొక రెమిడీ విషయానికి వస్తే.. బంగాళదుంప అలోవెరా, శెనగపిండి ఫేస్ ప్యాక్.. అయితే ఈ ప్యాక్ చేయడానికి బంగాళదుంప గుజ్జు, అలోవెరా జెల్ , రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండిని కలపాలి. మీరు పేస్ట్ చేయడానికి నీటిని ఉపయోగించవచ్చు. ఈ ఇలా ఫేస్ ప్యాక్‌ని అప్లై చేసి, మీ చర్మంపై 10 నిమిషాల పాటు ఉంచి, తర్వాత శుభ్రం చేయవచ్చని చెబుతున్నారు. మరో ఫేస్ ప్యాక్ విషయానికి వస్తే.. నిమ్మకాయ టమాటో ఫేస్ ప్యాక్ తో ఇన్స్టంట్ అందాన్ని పొందవచ్చు అని చెబుతున్నారు. మరి ఈ మిశ్రమాన్ని ఎలా తయారు చేసుకోవాలి అన్న విషయానికి వస్తే.. ఈ ప్యాక్ కోసం, టొమాటో గుజ్జును తీసుకొని, ఒక టీస్పూన్ నిమ్మరసం జోడించాలి. అలా అప్లై చేసి 15 నిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తర్వాత ముఖం శుభ్రం చేసుకోవాలి. మెరిసే చర్మం సొంతం కావాలి అనుకున్న వారు కాఫీ పాలు ప్యాక్ ట్రై చేస్తే చాలు. అందుకోసం ఈ రెండు పదార్థాలను 2:1 నిష్పత్తిలో కలిపి, మీ ముఖం మీద అప్లై చేయాలి. పాలలోని లక్షణాలు మీ చర్మానికి స్థితిస్థాపకతను నిర్ధారిస్తాయి. ఇది ముఖంపై ముడతలను తగ్గించడంతో పాటు, ముఖం మెరిసిపోయేలా చేయడంలో సహాయపడుతుందని చెబుతున్నారు.



## ఉద్యోగులు చేయి, మణికట్టు నొప్పితో ఎందుకు బాధపడుతున్నారు..?



నిరంతరం కంప్యూటర్ ముందు కూర్చునే వృత్తి నిపుణులు పని చేయడం సహజం. రోజులో ఎక్కువ భాగం పనికి కేటాయించడం అనేది కొంత మందిలో ఏదో ఒక అవసరం , ఆధునిక జీవనశైలి వలె దీనిని నివారించలేము అనేది కూడా వాస్తవం. చాలా మంది పని నిపుణులు పనిలో ఎక్కువ గంటలు గడపడం వంటి అనేక కారణాల వల్ల వేళ్లు, మణికట్టు, మోచేతులు , చేతుల్లో తీవ్రమైన నొప్పిని అనుభవిస్తారు. ఈ నొప్పిని తనిఖీ చేయకపోతే, ఇది దీర్ఘకాలిక చలనశీలత సమస్యలకు దారి తీస్తుంది. మీరు చేయగలిగే అనేక చేతి వ్యాయామాలు ఉన్నాయి, దీని కోసం డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్ మీకు మార్గనిర్దేశం చేయవచ్చు. ఆఫీసుకు వెళ్లేవారిలో చేయి నొప్పికి ఆరు సాధారణ కారణాల గురించి తెలుసుకుందాం. కంప్యూటర్‌ను ఉపయోగిస్తున్నప్పుడు టైపింగ్, మౌస్ ఉపయోగించడం, చేతిని నిరంతరం ఎత్తడం వంటి పునరావృత కదలికలు తరచుగా జరుగుతాయి, ఇది కండరాలు, స్నాయువులు , నరాలలో మంట , మైక్రోట్రామాకు దారితీస్తుంది. ఇది సాధారణంగా మణికట్టు, మోచేతులు , భుజాలను ప్రభావితం చేస్తుంది. కీబోర్డ్ , మౌస్ ఎక్కువసేపు ఉపయోగించడం వల్ల తరచుగా చేతులు , మణికట్టులో నొప్పి వస్తుంది. కొన్నిసార్లు తప్పు టైపింగ్ టెక్నిక్ లేదా గ్రిప్ ఉపయోగించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం మధ్యమధ్యలో చిన్నపాటి విరామాలు తీసుకోవడం, చేతులు, చేతులు, భుజాలను సాగదీయడం వంటి సాధారణ వ్యాయామాలు చేయవచ్చు. మీ కుర్చీ చాలా ఎత్తుగా లేదా చాలా తక్కువగా ఉంటే లేదా మీ డెస్క్ , మానిటర్ సరిగ్గా సర్దుబాటు చేయకపోతే, అది మీ మెడ, భుజాలు , చేతుల్లో ఒత్తిడిని కలిగిస్తుంది . ఈ నొప్పి మీ మణికట్టును ప్రభావితం చేసే కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ , స్నాయువుల వాపు వంటి టెండినిటిస్ వంటి సమస్యలను కలిగిస్తుంది. మీకు సరిపోయేలా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం ఈ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. మీరు విరామం లేకుండా చాలా గంటలు పని చేస్తున్నారని గమనించండి. వ్యాయామం లేకపోవడం లేదా శారీరక శ్రమ లేకపోవడంతో పాటు పెరిగిన పని , ఒత్తిడి తీవ్రమైన నొప్పికి దారి తీస్తుంది. టెన్నిస్ ఎల్బో లేదా గోల్ఫర్స్ ఎల్బో వంటి టెండినిటిస్ (కండరాల వాపు) వంటి పరిస్థితులను నిర్ధారించడానికి మీ వైద్యుడికి వైద్య పరీక్ష సహాయపడుతుంది , ఇవి మోచేయిని ప్రభావితం చేసే సాధారణ సమస్యలు. ముఖ్యంగా పునరావృత కార్యకలాపాలు చేసే వ్యక్తులలో ఈ నొప్పులు సర్వసాధారణం. అలాంటి నొప్పి లేదా అసౌకర్యం ఉంటే, వైద్యుడిని చూడటం మంచిది. ఒక వ్యక్తి పేలవమైన , నిష్క్రియాత్మక జీవనశైలిని నడిపించినప్పుడు , శారీరక శ్రమలకు తక్కువ సమయం ఇచ్చినప్పుడు, వారు కండరాల నొప్పి సమస్యను అభివృద్ధి చేయవచ్చు. అదనంగా, ధూమపానం లేదా ఊబకాయం , మునుపటి గాయాలు లేదా మధుమేహం , ఆర్థరైటిస్ వంటి సమస్యలను కలిగి ఉన్న వ్యక్తులు చేతులు , చేతుల్లో నొప్పిని కలిగి ఉంటారు. దీని కోసం, క్రమం తప్పకుండా స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయండి , మీ పని స్థలాన్ని మీకు సౌకర్యవంతంగా ఉంచండి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోండి.

## తిప్పతీగ ఆకు తింటే తిప్పలన్నీ మాయం..



తిప్పతీగ ఆయుర్వేదంలో చాలా పురాతనమైన ఔషధ మొక్క. దీని ఆకులు, కాండం రెండూ అనేక ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తాయి. ఈ మొక్కలో పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి.ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అనేక వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది.1. ఎముకలు: తిప్ప తీగను ప్రధానంగా ఎముకల బలహీనత, విరుగుడు గాయాలు (ఫ్రాక్చర్) సందర్భాలలో ఉపయోగిస్తారు. ఇది ఎముక కణాలను పునరుత్పత్తి చేస్తుంది. విరిగిన ఎముకలు మళ్లీ త్వరగా కుదించడానికి సహాయపడుతుంది. ఇందులో కాల్షియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇది ఎముకల కండరాలను బలపరుస్తుంది.2. జీర్ణక్రియ: తిప్ప తీగ ఆకులను జీర్ణ సమస్యలకు ఆయుర్వేద వైద్యంలో విరివిగా ఉపయోగిస్తారు. ఇది అజీర్ణం, గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. తిప్ప తీగ ఆకుల ముద్దను తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది.3. బరువు తగ్గడం: బచ్చలి కూరను బరువు తగ్గించే ప్రక్రియలో కూడా ఉపయోగిస్తారు. ఈ మొక్కలో ఉండే కాంపౌండ్స్ కొవ్వును కరిగించి శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గిస్తాయి. ఇది శరీరంలో జీవక్రియను పెంచుతుంది. తద్వారా క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది సహాయపడుతుంది. 4. చక్కెర నియంత్రణ: తిప్పతీగ ఆకులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. మధుమేహం ఉన్నవారికి ఇది ప్రధానంగా ఉపయోగపడుతుంది. ఈ మొక్కలోని రసాయనాలు ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను స్థిరంగా ఉంచుతాయి. అందువలన, ఇది మధుమేహం ప్రభావాన్ని తగ్గిస్తుంది. 5. కీళ్లనొప్పులు: తిప్ప తీగలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. కీళ్లనొప్పులు వంటి వ్యాధుల నివారణలో ఈ మొక్కను ఉపయోగించడం వల్ల శరీరంలోని కీళ్లలో మంట మరియు నొప్పులు తగ్గుతాయి. జాయింట్ సెన్సిటివిటీని తగ్గించడం ద్వారా జాయింట్ ఫ్లెక్సిబిలిటీని మెరుగుపరుస్తుంది. 6. చర్మ సమస్యలు: తిప్ప తీగ ఆకులు చర్మ సమస్యలకు ఉపయోగపడతాయి. ఇందులోని క్రిమినా శక లక్షణాలు కోతలు, కాలిన గాయాలు, చర్మ ఇన్ఫెక్షన్ల వంటి చర్మ సమస్యలను నివారిస్తాయి. ఆకును రసాన్ని తీసుకుని చర్మానికి రాసుకుంటే చర్మంపై జిడ్డు, మొటిమలు తగ్గుతాయి.

## అందం కోసం విలువైన రహస్యం పటిక

పటిక అనేది బహుముఖ సహజ నివారణ. పటికను మీరు సాధారణంగా కొన్ని షాపుల్లో చూసే ఉంటారు. ఈ పటికలో క్రిమి సంహారక గుణాలు కలిగి ఉండడంతో, గాయాలైనప్పుడు రక్తం కారిపోకుండా పటిక కాపాడగలదు. ఇందులోని పొటాషియం, అల్యూమినియం, సల్ఫేట్ అనే రసాయన పదార్థాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరిస్తాయి. ఇది జుట్టును శుభ్రపరచడంలో, శరీరంపై ముడుతలకు చికిత్స చేయడంలో, చెమటను నియంత్రించడంలో, చిగుళ్ల రక్తస్రావం నుండి ఉపశమనం పొందడంలో ఇంకా మూత్ర ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి మరియు చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి, చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇది చర్మంపై ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. పటిక నీటితో జుట్టు కడగడం వల్ల తలపై ఉన్న జుట్టులో ఉండే మురికి, పేలు వంటి తొలిగిపోతాయి. పటికను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం మీ జుట్టును కడగాలి. యూరిన్ ఇన్ఫెక్షన్ నుండి ఉపశమనం కలిగించేందుకు ప్రైవేట్ పార్ట్ లను శుభ్రం చేయడానికి పటిక నీరు ఉపయోగపడుతుంది.



పటిక పొడి శరీరంలో వాపు, నొప్పిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. ప్రభావిత ప్రాంతంపై దీన్ని పూయడం మంచిది. పటిక నీటిని ముఖానికి పట్టించడం వల్ల ముడతలు తగ్గుతాయి. రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల చర్మం బిగుతుగా, కాంతివంతంగా మారుతుంది. పటిక చెమట వాసనను తగ్గించడంలో సహాయపడుతుంది. పటిక నీటితో స్నానం చేయడం వల్ల చెమట సమస్య తగ్గుతుంది. పటిక నీటితో పుక్కిలించడం చిగుళ్ల నుండి రక్తస్రావం నుండి ఉపశమనం కలిగిస్తుంది. నోటి దుర్వాసనను కూడా తగ్గిస్తుంది.


# చార్టర్డ్ విమానాలను వదిలి సాధారణ ఫ్లైట్లలో అల్లు అర్జున్.. సింప్లిసిటీపై చర్చ



ఐకాన్ స్టార్ఞూశ్రీశ్రీబాూతీయబఅ మరోసారి తన సింప్లిసిటీతో వార్తల్లో నిలిచారు. ఇటీవల ఆయన ప్రైవేట్ చార్టెడ్ విమానాలకు బదులు కమర్షియల్ ఫ్లైట్లలో ప్రయాణిస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఆయన నటిస్తున్న =ఘ్యుఎు సినిమా షూటింగ్ కోసం హైదరాబాద్--ముంబై మధ్య తరచూ ప్రయాణాలు చేస్తున్నారు. ఈ సందర్భంలో నిర్మాతలు ప్రత్యేకంగా లగ్జరీ ట్రావెల్ సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, అల్లు అర్జున్ వాటిని సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. అనవసర ఖర్చులను తగ్గించి, ఆ నిధులను సినిమా నాణ్యత పెంపుకు వినియోగించాలని ఆయన భావిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆయన సాధారణ విమాన సర్వీసుల్లోనే ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల ఖుఖుశ్రీ ఝుయఖఅ కూడా ఇదే తరహాలో ఎకానమీ క్లాస్‌లో ప్రయాణించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అల్లు అర్జున్ తీసుకున్న ఈ నిర్ణయం కూడా సినీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాలు సాధిస్తున్న ఆయన, వ్యక్తిగత విలాసాల కంటే పని, సినిమా నాణ్యతకే ప్రాధాన్యం ఇస్తున్నారని అభిమానులు, సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నాగచైతన్య గోప్యతకు ఢిల్లీ హైకోర్టు రక్షణ

## అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు వాడకూడదు



టాలీవుడ్ హీరో చీఘ్రుఘ జఘ్రుఘటఘఅఘ వ్యక్తిగత హక్కుల పరిరక్షణకు సంబంధించి ఢిల్లీ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన అనుమతి లేకుండా పేరు, ఫొటోలు, వీడియోలు లేదా స్వరాన్ని వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగించకూడదని స్పష్టం చేసింది. తన పేరు మరియు చిత్రాన్ని అనుమతి లేకుండా కొంతమంది వాణిజ్యంగా ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తూ నాగచైతన్య కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు ఆయన గోప్యతా హక్కులను రక్షిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ తీర్పు ప్రకారం, ఇకపై ఆయన అనుమతి లేకుండా ఆయన ముఖ రూపం, పేరు లేదా ఇతర వ్యక్తిగత గుర్తింపులను కమర్షియల్‌గా ఉపయోగించడం చట్టవిరుద్ధంగా పరిగణించబడుతుంది. సినీ పరిశ్రమలో ఇప్పటికే పలువురు ప్రముఖులకు ఇలాంటి “పర్సనాలిటీ రైట్స్” రక్షణ లభించిన నేపథ్యంలో, ఈ నిర్ణయం కూడా అదే వరుసలో ముఖ్యమైనదిగా భావిస్తున్నారు.

# ఐవరీ చీరలో అప్సరసలా జాన్వీ కపూర్.. ‘పెద్ది’ ప్రమోషన్లలో స్పెషల్ అట్రాక్షన్

హీరోయిన్ జీఘఅష్ట్రజఅ ఖుజూశీశీ తన తాజా లుక్‌తో మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ూవఎఎఅ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె ధరించిన ఐవరీ చీర లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ప్రముఖ డిజైనర్ అనామికా ఖన్నా రూపొందించిన ప్రత్యేక ఐవరీ శారీలో జాన్వీ అందం మరింత హైలైట్ అయ్యింది. షీర్ ఫ్యాబ్రిక్‌పై సున్నితమైన ఎంబ్రాయిడరీతో తయారైన ఈ చీరకు డ్రామాటిక్ కేప్–స్టైల్ పల్లూ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. స్కాల్ప్డ్ లేస్ బోర్డర్లు, హెవీ ఎంబ్రాయిడరీతో రూపొందించిన స్వీట్‌హార్ట్ నెక్‌లైన్ బ్లౌజ్ ఈ లుక్‌కు ఆధునికతను జోడించాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలను షేర్ చేసిన జాన్వీ, “హెలో ఫ్రమ్ యువర్ జాను పాపా” అంటూ సరదా క్యాప్షన్ ఇచ్చారు. ఈ లేటెస్ట్ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ‘పెద్ది’ చిత్రంలో =ఘఎ జఘ్టుతీఘఅ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ డ్రామాకు సంగీతం ూా. =. ఘష్ట్రఎఘఅ అందిస్తున్నారు. ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. బెంగళూరు, ఢిల్లీ సహా పలు నగరాల్లో జరుగుతున్న ప్రమోషన్లలో జాన్వీ తన ఎథ్నిక్ లుక్స్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. స్టైలిస్ట్ మేగన్ కాన్సెసియో రూపొందించిన ఈ కొత్త అవతారం ప్రస్తుతం ఫ్యాషన్ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది.

